# 'కడ్డీ పహిల్వాన్ - కసరత్తు'

చిన్నప్పట్నించీ నాది అల్ప శరీరమే.

మా సావిత్రక్క నన్ను కడ్డీ పహిల్వాన్ అని ఏడిపించేంది.

నాలుగో ఏట క్షయవ్యాధి సోకడం, దానివల్ల శరీరం పూర్తిగా శుష్కించడం... మళ్లీ కోలుకోకున్నా కూడా 'బక్కోడు'గానే మిగిలా.

మా ఇంట్లో శివాజీ గురవైన సమర్థ రామదాసు పటం ఉండేది (ఇప్పటికీ ఉంది). దాంట్లో రామదాసు గడ్డంతో మంచి శరీర సౌష్ఠవంతో చిన్న కౌపీనంతో ఉంటాడు. ఆ బొమ్మ చూసి పీలగా ఉన్న నే కూడా గడ్డం పెంచుకుని అట్లాంటి శరీర సౌష్ఠవం తెచ్చుకోవాలని తెగ ఆరాటం చెందడం.

'(ఇప్పుడు గడ్డమైతే పెంచుకోగలిగా కానీ శరీర సౌష్ఠవం మాత్రం నహి నహి)

చిన్నప్పుడు ఆటల్లో మోహన్గాడు 'ఒరే బక్కోడా! బ్యాపనోడా! ఆకులూ అలమలూ తింటే కండెక్కదొస్తుందిరా మా లెక్క సియ్యిల్తినాలె' అనడమూ, అయిన్దానికి కాన్దానికి చితక్కొట్టడమూ, ఇవన్నీ కలిసి నాకు కసరత్తు మీద వ్యామోహాన్ని కలిగించాయి. మోహన్గాడు చెప్పినట్టు తింటానికి వీల్లేదు. బ్రాహ్మణ కొంప, ఇంట్లో మాంసాహారం జాన్తానై... అమ్మనడిగితే 'మొలకెత్తిన సెనగలు మాంసానికి దీటురా' అన్చెప్పేది. నాకు నమ్మకం కలిగేది కాదు.

హైస్కూలుకు వచ్చిం తర్వాత ఎన్.సి.సి. ఆకర్షించింది. దాంట్లో చేరడానికి కమాండెంటు సుందర్రాజు దగ్గరకెళ్లా భయం భయంగా... ఆయన భుజం తట్టి 'కండ కాదురా కావాల్సింది గుండె', అని ఎన్.సి.సి.లో చేర్చుకున్నాడు.

ఆ ఖాకీబట్టల్లో నేనో బుడబుక్కలవాడిలా నాకే అనిపించేవాణ్ణి. స్కూల్లో జిమ్ము లాంటిది సుందర్రాజుగారే ఏర్పాటుచేయించాడు. ఉదయం, సాయంకాలం కసరత్తు చేసేవాళ్లతో జిమ్ము సందడిగా ఉండేది. ప్రతీరోజూ వెళ్లడం కసరత్తు చేస్తూన్న వాళ్లని దూరం నించి చూట్టం, ఇంటికెళ్లి అద్దంలో నన్ను నేను చూసుకుని కుళ్లుకోడం. పుండు మీద కారంలాగా సావిత్రక్క నన్ను 'కడ్డీ పహిల్వాన్' అని వెక్కిరించడం.

ఓసారి మా హైస్కూలు పక్కగా ఉన్న హైవే కానుకునున్న పాకలు నిప్పంటుకున్నాయి. సాయంకాలం, జిమ్ములో కసరత్తు చేస్తూన్న వాళ్లందరూ కలిసి పదిహేను

నిముషాల్లో మంటలార్పేసారు. కసరత్తు 'చూ'స్తున్న నేనుకూడా వాళ్లతో వెళ్లా... ఆ నీళ్లూ ఇసుకా మోయలేక చేతకాక ఆ తొక్కిసలాటలో కిందపడి అసహాయంగా చూస్తూ ఓ పక్కగా ఉండిపోయా.

ఆ సంఘటన నా శారీరక అసక్తత మీద నాకు చాలాకోపం తెప్పించింది. ఎట్లాగైనా సరే శారీరక దారుఢ్యం పొందాలని నిర్ణయించుకున్నా. స్కూల్లో జిమ్ము కెళ్లాలంటే సిగ్గు... మరెట్లా? అప్పుడు కృష్ణమూర్తి మంగలి షాపుకొచ్చే జడ్సన్ గుర్తొచ్చాడు. జడ్సన్ హమాలీ, నల్లగా నిగనిగలాడ్తూ పురితిరిగిన కండల్తో పోతపోసిన ఉక్కు విగ్రహంలా ఉంటాడు.

వెళ్లి జడ్సన్ని కాకాపట్టి కండ పెంచే మార్గం కనుక్కోవాలి. ఉదయం దొరకడు. సాయంత్రం పట్టుకోవాలంటే కల్లు పెంట కెళ్లాలి. అక్కడ కెళ్లాలంటే భయం, పైగా బ్యాపనోడిని కదా.. అయినాసరే ఏమైతే అయ్యింది అనుకుని ఓ సాయంత్రం చీకటి పడుతూండగా వెళ్లా... జడ్సన్ ఉన్నాడు 'అన్నా నీతో మాట్లాడాలి' అని భయం భయంగా అన్నా... ఏ ఖయాల్లో ఉన్నాడో బైటికొచ్చాడు. సిగ్గు సిగ్గుగా నా కండల కోరిక చెప్పా... గట్టిగా నవ్వుతూ జడ్సన్ అన్నాడు.

'అయివోరూ యిదో యీ లెక్క కండ కావాలంటే కడుపుల కెల్లి ఆకలిమంట మండాలె' అతను ఏ కసరత్తు చేయడు. కాయకష్టంతో కండలు తిరిగినవాడు. అప్పుడు అర్థంకాలేదు నాకు. అయినా నా కోరిక అర్థం చేసుకుని హనుమాన్ వ్యాయామశాల సుబ్బయ్యకు నా గురించి చెప్పి, నన్ను రోజూ క్రమం తప్పకుండా ఈతకొట్టమని చెప్పాడు.

* * *

ఈరోజుకీ ఏభై ఏళ్లొచ్చినా శారీరక సౌష్టవం ఎలా ఉన్నా వ్యాయామం మీద మాత్రం ఒకానొక గౌరవం నాకు. దానివల్ల ఒకవిధమైన శారీరక, బౌద్ధిక క్రమశిక్షణ అలవడ్తుందని నా విశ్వాసం.

కొన్ని నెలల క్రితం మిత్రుడు వైద్యుడు ఉమానాథ్ను కలవడానికి హాస్పిటల్కి వెళ్లాను. అక్కడ మెడికల్ వార్డు బైట కానుగ చెట్టుకింద, దగ్గుతూ ఆయాసపడుతూ కూచున్న జడ్సన్ కనిపించాడు. అప్పటి పురి తిరిగిన కండల్లేవు... బక్కచిక్కి ఉన్నాడు... పైగా వార్థక్యం..." అన్నా ఇట్లా అయిపోయినావేమి?" అనడిగా.

"ఏముంది అయివోరూ కండపాయ తాగితాగి గుండెపాయ, ఇప్పుడు కండల్యాక కూడు పాయ వొయిసొచ్చి మీనవడె" అని ఖళ్లు ఖళ్లుమని నవ్వుతూ దగ్గుతూ రెండు చేతలూ ఎత్తి బక్కచిక్కి వేల్లాడ్తోన్న దండలు చూపించాడు.

జడ్సన్లాంటివాళ్లు అసంఖ్యాకంగా ఉన్న మన సమాజంలో తిండికీ కండకూ ఉన్న సంబంధం దిగంబరంగా కనిపించింది. ●